నష్టాలను మిగిల్చిన టమాట సాగు

- మార్కెట్‌లో నెల రోజులుగా పడిపోయిన ధరలు
- నియోజకవర్గంలో 3వేల ఎకరాలలో సాగు
- ఎకరాకు రూ.50వేలకుపైనే పెట్టుబడులు
- కోతకు వచ్చినా తోటలలో వదిలేసిన వైనం
- ఆందోళనలో టమాట రైతులు


ధరలులేక తోటలలో కోత కోయక మాగిపోతున్న టమాటలు

వేముల : ఈ ఏడాది టమాట సాగు రైతులకు నష్టాలను మిగిల్చింది. సాగులో వేల రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు ధరలు పడిపోడంతో ఆందోళన చెందుతున్నారు. టమాట సాగు సమయంలో ఉండే ధరలు దిగుబడులు వచ్చే సమయానికి పడిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ధరలు ఉంటాయో, ఎప్పుడు సాగు చేయాలో తెలియని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

నియోజకవర్గంలో 3వేల ఎకరాలలో సాగు

పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా 3వేల ఎకరాలలో టమాట సాగైంది. పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లె, చక్రాయపేట మండలాల్లో అధికంగా... సింహాద్రిపురం, తొండూరు మండలాల్లో అక్కడక్కడ రైతులు టమోట సాగు చేసుకున్నారు. ఈ ప్రాంత రైతులు ఎక్కువగా ఆగష్టు, సెప్టెంబరు మాసాలలో సాగు చేస్తారు. సాగులో దిగుబడులు వచ్చే సమయానికి ధరలు ఉండేలా చూస్తారు. అయితే వాతావరణ పరిస్థితులు, మార్కెట్ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

ఎకరాకు రూ.50వేలకుపైనే పెట్టుబడులు

ఎకరాకు రూ.50 వేలకుపైనే పెట్టుబడులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. స్థానికంగా ఉన్న నర్సరీలలో నారు తెచ్చి నాటుతున్నారు. ఈ ప్రాంత రైతులు ఎక్కువగా సాహూ, వైభవ్, 3140, 440 వంటి రకాలను సాగు చేస్తారు. ఒక్క మొక్క 80 పైసల నుంచి రూ.1.50లతో కొనుగోలు చేసి సాగు చేశారు. ఎకరానికి 14వేల మొక్కలను నాటుతున్నారు. పంట సాగు మొదలు దిగుబడులు కోతకు వచ్చే పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందన్నారు. పంటకు సోకే తెగుళ్ల నివారణకు మందుల కోసం అదనంగా పెట్టుబడులు అవుతున్నాయి. వారానికొకసారి పురుగు మందులను స్ప్రే చేయాల్సి వస్తోందన్నారు. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడుతూ పంటను కాపాడుకుంటున్నారు.

ఎకరానికి 10 టన్నులకుపైనే దిగుబడులు

ఎకరానికి 10 టన్నులకుపైనే దిగుబడులు ఉంటాయని రైతులు అంటున్నారు. పంట సాగు చేసిన మూడు నెలల నుంచి దిగుబడులు చేతికి వస్తాయి. సాగులో రెండు నెలలపాటు దిగుబడులు అందుతాయి. పంట కాలం 5నెలల్లో తోటలలో కోతలు కోసేందుకు వీలుంటుంది. తోటలలో పంటకు తెగుళ్ల సోకకుండా కాపాడుకుంటే 15 టన్నుల వరకు కూడా దిగుబడులు వస్తాయని ఉద్యాన శాఖాధికారి రాఘవేంద్రారెడ్డి తెలిపారు.

మార్కెట్‌లో పడిపోయిన టమాట ధరలు

గతనెల రోజులుగా మార్కెట్‌లో టమాట ధరలు పడిపోయాయి. కొంతమంది ముందుగానే సాగు చేసిన తోటలలో ముందుగా దిగుబడులు రావడంతో ధరలు ఉండేవి. అయితే నెల రోజులుగా తోటలలో దిగుబడులు రావడంతో రైతు మార్కెట్‌కు తరలించారు. దీంతో పడిపోయిన ధరలు పుంజుకోలేదు. ఎక్కువగా జూలై, ఆగష్టు మాసాల్లో ఖరీఫ్ పంటగ రైతులు టమాట సాగు చేశారు. ప్రస్తుతం 25కిలోల టమాటల ప్యాకెట్ రూ.150 మించి ధరలు లేవు. టమోటలను మదనపల్లె, చిక్బళ్లాపురం, చెన్నై, నెల్లూరు, కలకడ తదితర ప్రాంతాలకు రైతులు తరలిస్తున్నారు. అయితే మార్కెట్‌లో ఆశించిన ధరలు లేక టమాటలను తోటల్లోనే వదిలేస్తున్నారు.

సాగులో తీవ్రంగా నష్టపోయా



టమోట సాగులో తీవ్రంగా నష్టపోయా. నాకున్న 8ఎకరాలలో టమాట సాగు చేశా. సాగుకు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టా. తోటలో టమోటలు కోతకు వచ్చినప్పటి నుంచి మార్కెట్ ధరలు పడిపోయాయి. టమోటలు కోత కోసిన కూలీలు, రవాణా ఖర్చులు రాకపోవడంతో కోత కోసేందుకు వెనకడుగు వేస్తున్నాం.

– గంగాధర,టమోట రైతు, వేముల

టమాటల సరఫరా ఎక్కువ కావడంతోనే



తోటలలో ఒకేసారి దిగుబడులు కోతకు వచ్చాయి. రైతు ఒకేసారి టమాటలు మార్కెట్‌కు తరలించారు. దీంతోనే మార్కెట్‌లో ధరలు తగ్గాయి. ధరలు లేక పోవడంతో రైతులు సాగులో నష్టపోతున్నారు. ధరలు ఎప్పుడు వస్తాయో.. మార్కెట్ పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేని పరిస్థితి. ధరలు వచ్చేవరకు రైతులు ఎదురుచూడాల్సిందే.

– రాఘవేంద్రారెడ్డి(హెచ్‌ఓ), పులివెందుల

క్లుప్తంగా

వ్యాధి నిరోధక టీకాలను వేయాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఉమామహేశ్వరరావు

వేంపల్లె : చిన్నారులకు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా ఆరోగ్య సిబ్బంది వ్యాధి నిరోధక టీకాలను వేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమామహేశ్వరరావురావు తెలిపారు. గురువారం మండలంలోని తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాళ్లపల్లె, వేముల, సురభి, చక్రాయపేట, వీరపునాయునిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సూపర్ వైజర్లకు, ఆరోగ్య సిబ్బందికి వ్యాధి నిరోధక టీకాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమామహేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద శిబిరాలను ఏర్పాటు చేసి వ్యాధి నిరోధక టీకాలను వేయాలని, వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజా మొద్దీన్, వైద్యులు, సూపర్ వైజర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన


గొర్రెలకు చికిత్స అందిస్తున్న వైద్యుడు

ముద్దనూరు : పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని పెనికలపాడు, యామవరం గ్రామాల్లో పశు ఆరోగ్యశిబిరాలు నిర్వహించి పలు చికిత్సలు అందించినట్లు పశువైద్యాధికారులు వాసా శ్రీనివాస, హిమబిందులు తెలిపారు. ఈ శిబిరంలో 3695 గొర్రెలకు నట్టల నివారణ మందులు, 89 దూడలకు ఏలిక పాముల నివారణ మందులు తాపించినట్లు వారు తెలిపారు.79 పశువులకు సాధారణ వైద్యం, 29 పశువులకు ఎద సూదులు అందించి, 5 పశువులకు కృత్రిమ గర్భధారణ, 29 పశువులకు చూలు పరీక్షలు నిర్వహించినట్లు పశువైద్యులు తెలిపారు.

వృద్ధాశ్రమానికి విద్యుత్ ఉద్యోగుల సాయం


నిత్యావసర సరుకులను అందిస్తున్న విద్యుత్ ఉద్యోగుల సేవా సంఘం నేతలు

ఎర్రగుంట్ల : మండలంలోని తిప్పలూరు గ్రామంలో ఉన్న ఎద్దుత పెద్దశేషమ్మ అనాథాశ్రమానికి కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం తరుపున రూ.31 వేలు నిత్యావసర సరుకులను అందించారు. ఈ మేరకు గురువారం సంఘం అధ్యక్షుడు కె రమేష్, కార్యదర్శి జీ నాగశేషారెడ్డి, డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు కేవీ రమణారెడ్డి, ఎర్రగుంట్ల ఏడీఈ కిరణ్‌కుమార్, ఏఈ ప్రియదర్శినిరెడ్డిల చేతుల మీదుగా ఈ నిత్యావసర సరుకులను ఆశ్రమం నిర్వాహకుడు నాగేంద్రకు అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మోరీయా ప్రార్థన మందిరం ప్రారంభం

వేంపల్లె : మండలంలోని కుమ్మరాంపల్లెలో నూతనంగా నిర్మించిన మోరీయా ప్రార్థన మందిరాన్ని గురువారం కడపకు చెందిన దైవ సేవకులు ఆనంద్ రాజ్, హైదరాబాద్‌కు చెందిన హైబ్రోన్ దైవ సేవకులు ముత్తయిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అలాగే కార్యక్రమానికి వచ్చిన వారందరికీ అన్నదానం చేపట్టారు.

రేపు జమ్మలమడుగులో సదస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయంం తరలించడాన్ని నిరసిస్తూ శనివారం జమ్మలమడుగు పాత బస్టాండు ఆవరణలో ప్రజాభిప్రాయ సదస్సు, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీజీబీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ డి.మహమ్మద్ పిలుపునిచ్చారు. జమ్మలమడుగు నియోజకవర్గ ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు, ఉద్యోగులు పాల్గొనాలని ఆయన కోరారు. గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమస్యగా చూడకుండా ఈ ప్రాంత ప్రయోజనాలతో ముడి పడి ఉన్న సమస్యగా భావించాలని, ఇది ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని ఆయన తెలిపారు.

ఘనంగా తిరునాల

కొండాపురం : మండలంలోని చౌటిపల్లె పునరావాస కాలనీలో గురువారం లింగమయ్య స్వామి తిరునాల ఘనంగా నిర్వహించారు. కాలనీలోని పెద్దమ్మతల్లికి పెద్ద ఎత్తున మహిళలు బోనాలు సమర్పించి ముక్కుబడులు చెల్లించారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి పనుల వద్ద కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ ఆది శేషారెడ్డి

వల్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఆదిశేషారెడ్డి గురువారం పరిశీలించారు. గోటూరు, వల్లూరు గ్రామపంచాయతీల్లో జరుగుతున్న ఫీడర్ ఛానల్ పూడికతీత పనులను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కూలీల హాజరును తనిఖీ చేసి కూలీలతో మాట్లాడారు. వల్లూరు గ్రామపంచాయతీలో సత్యనారాయణరెడ్డి అనే రైతుకు సంబంధించి గోకులం షెడ్ నిర్మాణం, హార్టికల్చర్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు సోమశేఖర్‌రెడ్డి, ఏపీవో సుధారాణి, ఈసీ అంజలి, ప్లాంటేషన్ సూపర్వైజర్ సుబ్బారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. కోరంలేక వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట,ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరి చేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు ప్రభుత్వ చౌక దుకాణ డీలర్ల ఎంపికకు పరీక్ష

ఎర్రగుంట్ల : మండలంలోని ఖాళీగా ఉన్న 25 ప్రభుత్వ చౌక దుకాణాలకు డీలర్ల నియామకంపై శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎర్రగుంట్ల తహసీల్దార్ శోభన్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన నిర్వహించాల్సిన పరీక్షను అనివార్యకారణాల వల్ల వాయిద పడటంతో 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి సుమారు 38 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. పట్టణంలో 1వ వార్డు (ఓసీ మహిళ), 1, 2 వార్డులు(బీసీ-ఈ), 3వ వార్డు(బీసీ-ఎ), 4వ వార్డు(ఎస్సీ మహిళ), 4, 5 వార్డులు (ఓసీ, మహిళ), 7వ వార్డు (ఎస్సీ), వై కోడూరు(ఓసీ మహిళ), వై కోడూరు (ఓసీ, పీడబ్ల్యూబీడీ), పెద్దనపాడు (ఈడబ్ల్యూఎస్), తుమ్మలపల్లి(ఎస్టీ), వలసపల్లి (ఓసీ మహిళ), నిడుజివ్వి(బీసీ-బి), చిలంకూరు (ఓసీ, ఎక్స్‌సర్వీస్), సున్నపురాళ్లపల్లి (ఓసీ), సున్నపురాళ్లపల్లి (ఎస్సీ), ఇల్లూరు (బీసీ-ఈ), పోట్లదుర్తి (ఎస్సీ, మహిళ), పి.వెంకటాపురం (ఓసీ, క్రీడాకారుడు), ఎర్రగుంట్ల (ఓసీ).

కొత్త దుకాణాలు :

చిలంకూరు-1(బీసీ-ఎ), చిలంకూరు-1(ఓసీ మహిళ),పోట్లదుర్తి(ఓసీ,పీడబ్ల్యూబీడీ), పోట్లదుర్తి (ఓసీల), వినాయకనగర్ (ఎస్టీ, మహిళ), కలమల్ల-1 (ఓసీ, మహిళ) షాపులు ఖాళీగా ఉన్నాయన్నారు.

పాల ఉత్పత్తిని పెంచండి


బయనపల్లెలో పోస్టర్లు విడుదల చేస్తున్న డాక్టర్ శివజ్యోతి

కమలాపురం : పాడి పరిశ్రమ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పాల ఉత్పత్తిని పెంచుకోవాలని పశు వైద్యాధికారులు మల్లికార్జున రెడ్డి, శివజ్యోతి తెలిపారు. మండలంలోని మొలకవారిపల్లె, బయనపల్లె గ్రామాలలో గురువారం వారు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించి పోస్టర్లు విడుదల చేశారు. ఆరోగ్య శిబిరాలు, అందించే వైద్య సేవల గురించి పశు పోషకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి పరిశ్రమ రైతులను ఆదుకునేందుకే ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. షెడ్యూల్ ప్రకారం జరిగే ఈ శిబిరాలకు పశు పోషకులు తమ పశువులను తీసుకువచ్చి వైద్య సేవలు పొందాలన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని పాల ఉత్పత్తిని పెంచి తమ జీవన స్థితిగతులు మెరుగు పరచుకోవాలన్నారు. మొలకవారిపల్లెలో 35 పశువులకు సాధారణ చికిత్సలు, 4 గర్భకోశ వ్యాధికి చికిత్సలు, 265 పశువులకు, 140 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును తాపించారు. బయనపల్లెలో 187 సాధారణ చికిత్సలు, 16 గర్భ సంబంధ చికిత్సలు, 13 చూడి నిర్ధారణ పరీక్షలు, 53 లేగ దూడలకు ఏలికపాము మందులు, 74 జీవాలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మైనర్ పిల్లలు వాహనాలు నడపరాదు


మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసాద్

పులివెందుల రూరల్ : మైనర్ పిల్లలు వాహనాలు నడపరాదని, అది చట్టవిరుద్ధమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.వి.ప్రసాద్ తెలిపారు. 36వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు గురి చేయవద్దన్నారు. అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరు వాహనాలకు సంబంధించి లైసెన్సు, రికార్డులు కలిగి ఉండాలన్నారు. అనంతరం ట్రాఫిక్ సీఐ హాజీవలి మాట్లాడుతూ విద్యార్థులకు డ్రైవర్లకు వాహనాదారులకు ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ జీవనశైలితో మానసిక ఆరోగ్యం

కడప ఎడ్యుకేషన్: ఉత్తమ జీవనశైలితో మానసిక ఆరోగ్యం కాంతులీనుతుందని వైవీయూ ఇన్‌ఛార్జ్ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్, వైవీయూ ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా యువత మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం అంశంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని వీసీ గురువారం ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు, వ్యక్తిగత భేదాలు, ప్రాంతాలు, ఆహారపు అలవాట్లు మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. రిజిస్ట్రార్ పి.పద్మ మాట్లాడుతూ ఆలోచించే సమయం తీరిక లేక..యువకులలో ఒత్తిడి, నిరుత్సాహం ఆవరిస్తోందని తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొ.ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సోషల్ మీడియా, ఇంటర్నెట్‌లో ఎక్కువ సమయం గడపడంతో మానసిక రుగ్మతలకు లోనవుతున్నారని తెలిపారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు


పులివెందులలో చంద్రబోస్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్


వేంపల్లె : నేతాజీ చిత్ర పటంవద్ద నివాళులర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు


జమ్మలమడుగు : సుభాష్‌చంద్రబోస్‌కు నివాళులు అర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్లు హాలు గంగాధరరెడ్డి, హఫీజ్‌లు నివాళులర్పించి మాట్లాడారు. సుభాష్ చంద్రబోస్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నూర్ బాషా రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, జేసీఎస్ కన్వీనర్ పార్నపల్లి కిశోర్, సీనియర్ నాయకులు వెంకట సుబ్బయ్య, కౌన్సిలర్లు గండి రాము, ఖాదర్, కో ఆప్షన్ చంద్రమౌళి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇస్లాంపురం ఉర్దూ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బండి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నేతాజీ చిత్ర పటానికి నివాళులర్పించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత జాతీయ సైన్యాధిపతి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.యోగాంజనేయులు తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని, ఇడుపులపాయలోని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను నిర్వహించి నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ నేటి భారతీయులకు ఎంతో ఆదర్శనీయుడు అని కొనియాడారు. నేటి సమాజంలో ప్రతి పౌరుడు దేశభక్తిని మనసులో నింపుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ ఏఓ రవికుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ దీప్తి, ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతిరెడ్డి, రెడ్ రిబ్బన్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ అరవింద్, లైబ్రరీ విభాగాధిపతి మాధవరావు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : జననం తప్ప మరణంలేని యోధుడు స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్‌చంద్రబోసు అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా స్థానిక ఐటీఐ కాలేజిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య కోసం పోరాటం చేయడంతోపాటు అజాద్ హిందూఫౌజ్ సంస్థను ఏర్పాటు చేసి పోరాటం చేసిన యోధుడు అని కొనియాడారు. బ్రిటిషు ప్రభుత్వానికి గడగడ లాండించిన నాయకుడన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ ఫలితాలకు కృషి


సీకేదిన్నె జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈఓ షంషుద్దీన్

చింతకొమ్మదిన్నె : విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించి మ్యాథమెటిక్స్, సోషల్, తెలుగులో ప్రశ్నలు అడిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీ నిత్యానంద రాజు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాలు సరే... రోడ్డు మాటేమిటీ?


తారు లేచిపోయి.. అధ్వానంగా కనిపిస్తున్న రహదారి

కడప కల్చరల్ : తిరుమలేశుని తొలి గడప దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా ప్రజలకు ఈ ఉత్సవాల గురించి పెద్ద స్థాయి సెంటిమెంట్ ఉంది. ఉత్సవాలు జరిగినన్ని రోజులు పెద్ద ఎత్తున జనం వస్తారు. ప్రధానంగా రథోత్సవం రోజున రోడ్లన్నీ కిక్కిరిసిపోతాయి. ఇప్పటికే ఈ ఉత్సవాల గురించి ప్రచారం ప్రారంభమైంది. కానీ కడప నగరం నుంచి దేవుని కడప గ్రామానికి వెళ్లేందుకు రోడ్డును గమనిస్తే అన్యాయం అనిపించకమానదు. ముఖ్యంగా మార్కెట్‌యార్డు నుంచి దేవుని కడప చెరువు వరకు రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. గత కమిషనర్ రోడ్ల విస్తరణలో భాగంగా మార్కెట్ యార్డు మొదట్లో భారీగా సర్కిల్ ఏర్పాటు చేశారు. మాసాపేట సెంటర్‌లో సర్కిల్ ఏర్పాటుచేసి దేవుని కడప నమూనా గోపురాన్ని ఏర్పాటు చేయడంతో భక్తులు ఎంతో సంతోషించారు. ఆ తర్వాత మార్కెట్‌యార్డు వద్ద కూడా సర్కిల్ ఏర్పాటు చేయడంతోపాటు దేవునికడప వరకు రోడ్డును విశాలం చేసి అందంగా తీర్చిదిద్దుతారని ఆశించారు. తీరా పనులు ప్రారంభం కాగానే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారింది.

మన భవిష్యత్తు మన చేతిలోనే


విద్యార్థులకు వివరిస్తున్న వెంకట సాహిత్య

జమ్మలమడుగు : ప్రతి విద్యార్థి భవిష్యత్తు నిర్దేశించుకునే అవకాశం వారికి మాత్రమే ఉంటుందని చార్టెడ్ అకౌంటెడ్ వెంకటసాహిత్య తెలిపారు. గురువారం పట్టణంలోని ఎస్వీ డిగ్రీకాలేజి ఆవరణలో మేబిహెల్ప్‌యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థిని విద్యార్థులకు యువతకు ప్రేరణాత్మక మార్గదర్శన పేరుతో ప్రత్యేక తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిగ్రీలు, పీజీలు చదువుకుంటూ పోతే ఉపాధి, ఉద్యోగావకాశాలు రావని ప్రతి విద్యార్థికి స్కిల్ డెవలప్‌మెంట్‌తోపాటు సబ్జెట్ ఉండాలని సూచించారు. బట్టి చదువులకు స్వస్తి చెప్పి విశ్లేషణాత్మకంగా చదువుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలను సులభంగా సాధించుకునే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు ఒక లక్ష్యం పెట్టుకుని వాటిని సాధించుకోవడం కోసం కష్టపడాలని సూచించారు. పరీక్షలంటే భయపడకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజి కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పెయ్య దూడల ఉత్పత్తి


పశువులకు వైద్య సేవలు అందిస్తున్న పశువైద్య సిబ్బంది

వేంపల్లె : లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పెయ్య దూడలు ఉత్పత్తి అవుతాయని పశువైద్య శాఖ ఏడీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం చింతలమడుగుపల్లెలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పశువులకు, గొర్రెలకు, మేకలకు, నట్టల నివారణ మందులు, గర్భాశయ వ్యాధి టీకాలు, పలు వైద్య సేవలు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పెయ్య దూడలు మాత్రమే పుడతాయని, తద్వారా పాడి అభివృద్ధి చెందుతుందన్నారు. లింగ నిర్ధారిత వీర్యం టీకా కోసం ప్రభుత్వం రూ.1350లు ధర నిర్ధారించిందన్నారు. అందులో పాడి రైతులకు రూ.850లు సబ్సిడీ పోను, రూ.500లు చెల్లించాలన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని చదివినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రహమతుల్లా ఖాన్, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

పెంపకంలో మెలకువలు పాటించాలి


పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రమణయ్య

పెండ్లిమర్రి : పాడి రైతులు లేగ దూడల పెంపకంలో మెలకువలు పాటించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రమణయ్య తెలిపారు. గురువారం మండలంలోని కొత్తపేట గ్రామంలో పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భదారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు పశువుల పెంపకంలో పశువైద్యాధికారుల సలహాలు, సూచనల మేరకు పశువులకు, దూడలకు వ్యాక్సిలు వేయాలన్నారు. అనంతరం కృత్రిమ గర్భదారణ ద్వారా పుట్టిన 65 లేగ దూడలను పరిశీలించి వాటిలో ఆరోగ్యవతంగా ఉన్నవాటికి దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శ్రీధర్ లింగారెడ్డి, డీఎల్‌డీఏ శివరామిరెడ్డి, పశువైద్యాధికారి సురేష్ పాల్గొన్నారు.